క్లుప్తంగా

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు



బలపాలతిప్పలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయరాదని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జబ్బీర్ చెంచులకు సూచించారు. శనివారం ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జానాల గూడెం, బలపాలతిప్ప, సిద్దేశ్వరం, కపిలేశ్వరం గ్రామాల్లో సంచార చికిత్సలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చెంచులకు, ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సలహాలు ఇచ్చారు.

పంట నమోదు తప్పనిసరి



పంట నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: సాగుచేసుకున్న ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి అమీరున్నిసాబేగం రైతులకు సూచించారు. శనివారం మండలంలోని శివపురం గ్రామ పరిధిలో వ్యవసాయ సిబ్బంది చేపట్టిన ఈక్రాప్ నమోదును ఆమె తనిఖీ చేశారు. పంట నమోదు చేసుకునేలా ప్రతి రైతును ప్రోత్సహించాలని సిబ్బందికి ఆమె సూచించారు.

డిగ్రీ కళాశాలలో 'గ్రీన్ ఆంధ్రా'



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నేషనల్ సర్వీస్ స్కీం తరపున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబర్ నెల గ్రీన్ ఆంధ్రా ముఖ్యఉద్దేశంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.రాజన్న, డాక్టర్ ఎస్.శివనాగిరెడ్డి, డాక్టర్ వై.కిరణ్‌కుమార్, ఎస్.మహేశ్వరరెడ్డి, ఎస్.పూర్ణేశ్వరరెడ్డి, టి.ఇందిరా ప్రియదర్శిని, షాహిదా, మీనాక్షి పాల్గొన్నారు.

యూరియా సరఫరా



బండి ఆత్మకూరు: మండలంలోని రామాపురం, లింగాపురం, నారాయణపురం, ఏ కోడూరు గ్రామాలలో 95 టన్నుల యూరియా సరఫరా చేశామని మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ తెలిపారు. శనివారం రామాపురం, నారాయణపురం గ్రామాలలో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ పద్మావతి పరిశీలించారు. రైతులకు టోకెన్లు ఇచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి యూరియాను అందించామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఈశ్వర్, మౌలాలి వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక చక్రధర్ రెడ్డి, ఎంపీఈఓ శక నాయక్ పాల్గొన్నారు.

ఓంకార క్షేత్రంలో దసరా శోభ

- రేపటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- రోజుకో అలంకరణలో దర్శనం ఇవ్వనున్న అమ్మవారు



విద్యుత్ అలంకరణలతో ముస్తాబయిన ఓంకార క్షేత్రం

బండి ఆత్మకూరు: విజయ దశమి రాకతో ఓంకార క్షేత్రానికి దసరా శోభ వచ్చింది. దీంతో మండలంలో వెలసిన గంగా ఉమా సమేత ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్వాహకులు విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్ల కలి్పంచే పనిలో నిమగ్నమయ్యారు.

అమ్మ వారి తొమ్మిది రోజుల దర్శనం ఇలా..

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈనెల 22న బాలాత్రిపుర సుందరీ దేవిగా, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనీ దేవి, 26న మహాలక్ష్మి దేవి, 27న లలిత త్రిపుర సుందరీ దేవి, 28న మహా చండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసుర మర్ధిని దేవి, 2న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

పాఠశాలలకు దసరా సెలవులు.

- **పాములపాడు:** ప్రభుత్వం ఈనెల 22 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించింది. 21న ఆదివారం కావడం, శనివారం కాంప్లెక్స్ మీటింగ్ ఉండటంతో హాస్టళ్లలోని విద్యార్థులు తమ స్వగ్రామాలకు మధ్యాహ్నం నుంచే బయలుదేరి వెళ్లారు.



పాఠశాల నుంచి ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

- **శ్రీశైలంప్రాజెక్ట్:** ప్రభుత్వం దసరా సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు తమతమ స్వంత ఊర్లకు బయలుదేరారు. సున్నిపెంటలో బీసీ రెసిడెన్షియల్, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాల, గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాల, కాలేజ్ హాస్టల్ ఉన్నాయి. ఆయా పాఠశాలలు, కళాశాలలో సుమారు 2,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. దసరా సెలవులు ఇవ్వడంతో వారు సంతోషంగా బయలుదేరి వెళ్లారు.



శ్రీశైలం నుంచి తమ స్వగ్రామాలకు బయలుదేరేందుకు బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబానికి బలం



యర్రగూడూరు సచివాలయంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజు

పాములపాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటూ కుటుంబం అంత బలంగా ఉంటుందని మండల ప్రత్యేకాధికారి రాజు అన్నారు. శనివారం మండలంలోని యర్రగూడూరు గ్రామంలో స్వస్థ్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.

వైద్యశిబిరం

స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వద్ద స్వస్థ్ నారీ - స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఆయుర్వేదం వైద్యులు సావిత్రీ, హోమియోపతి గజరాజు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మహిళలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు మేకల భాగ్యమ్మ, వార్డు సభ్యురాలు శ్రీలత, యోగా ట్రైనర్స్ శివప్రసాద్, మల్లేశ్వరి పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య కొలతలు

నందికొట్కూరు: పట్టణంలోని సీఎస్ఐ సమాధుల స్థలానికి పోలీసు బందోబస్తు మధ్య శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వేయర్లు కొలతలు వేశారు. నాలగైదు నెలల నుంచి రెండు వర్గాల మధ్య స్థల వివాదం నెలకొంది. సమస్య ఉధృతంగా మారుతున్నా రెవెన్యూ అధికారులు ఎటూ తేల్చకపోవడంతో సమస్య పోలీసు స్టేషన్‌కు చేరింది. డీఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం జోక్యం చేసుకుని రెండు వర్గాలు ఘర్షణలు పడకుండా సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కొలతలు వేయించారు. సర్వే నంబరు 407లో సీఎస్ఐ సమాధులకు 75 సెంట్ల స్థలం ఎంత వరకు వచ్చిందో కొలతలు వేశారు. ఇరువర్గాలతో సీఐలు చర్చించారు. మరోవైపు ఇరువర్గాలను ఒప్పించి సమస్యను పారదర్శకంగా పరిష్కరించి సమన్యాయం చేయాలని మేధావులు కోరుతున్నారు. కొలతల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిగటోకా తెగులు పట్ల జాగ్రత్త వహించాలి

మహానంది: అరటిలో సిగటోకా తెగులు వస్తుందని, రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా స్థానం సైంటిస్ట్ డాక్టర్ హేమాద్రి సూచించారు. గాజులపల్లెలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. సిగటోకా తెగులు సోకిన ఆకులను తొలగించి కాల్చేయాలన్నారు. నివారణకు ఆరు నెలలలోపు ఉన్న పంటలకు ప్రొపికొనజోల్ లేదా మాంకజెబ్ మందులను, ఆరునెలల కంటే ఎక్కువగా ఉన్న పంటలకు టెబుకనజోల్, క్లోరథలోనిల్ లాంటి వాటిని వాడుకోవాలన్నారు. అరటిలో తామర పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లాంటి వాటిని ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో మహానంది మండల ఉద్యాన శాఖ అధికారి బి.హరేంద్ర పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల క్లైమ్‌లు విడుదల చేయాలి



కార్మికులతో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

శ్రీశైలంప్రాజెక్ట్: భవననిర్మాణ కార్మికులకు రావలసిన పెండింగ్ క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. శనివారం అంబేడ్కర్ సెంటర్‌లో భవననిర్మాణ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు అన్వర్‌బాషా, పుష్పరాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా, సుప్రీం కోర్టు తీర్పు ననుసరించి బోర్డులో కార్మికులు జమచేసుకున్న నిధులను విడుదల చేయాలన్నారు. సామాజిక పింఛన్ రూ.8,000 ఇవ్వాలన్నారు. సంతకాల సేకరణలో ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు నాగిరెడ్డి, పులిరాజు, టి.మల్లికార్జున, కె.దేవయ్య, చాట్ల రాజు, మల్లికార్జున, అల్లూరయ్య, సెంట్రింగ్ రాజు పాల్గొన్నారు.

వీఆర్‌ఏలకు కనీసం వేతనం ఇవ్వాలి



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏల సంఘం నాయకులు, ఏఐటీయూసీ నాయకులు

ఆత్మకూరు: వీఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త ఆందోళనల్లో భాగంగా ఆత్మకూరులోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట శనివారం వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టి, ఆర్డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ వీఆర్‌ఏలు చాలీచాలని వేతనాలతో ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా వారి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ వీఆర్‌ఏల సంఘం నాయకులు మహేష్, పరమేశ్వరుడు, మధు, రమేష్, నాగరాజు, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న ఏకలవ్య నగర్



ఏకలవ్య నగర్‌లో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: చిన్నపాటి వర్షానికే పట్టణంలోని ఏకలవ్య నగర్‌లో వర్షపునీరు చేరి చెరువును తలపిస్తోందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, పట్టణ కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. శనివారం వారు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లపై నీళ్లు నిలవడంతో నడిచేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా రోడ్లు, డ్రెయినేజీలను ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రామ్ నాయక్, సురేంద్ర, వెంకటేష్, నాగేషులు, ఆంజనేయులు, అన్నారావు, శీను తదితరులు పాల్గొన్నారు.

నేడు నంద్యాలకు మహానందీశుడి దంపతులు

మహానంది: దసరా నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులు ఆదివారం నంద్యాలకు వెళ్లనున్నారు. ఆనవాయితీ ప్రకారం ఏటా దసరా ఉత్సవాలకు స్వామి, అమ్మవార్లు నంద్యాలలోని బ్రహ్మానందీశ్వరస్వామి దేవస్థానానికి వెళ్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం మంగళవాయిద్యాలతో బయలుదేరి వెళ్తారని వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

కొత్తపల్లి: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని బట్టువారి పల్లె గ్రామానికి చెందిన తిమ్మరాజు, రాముడు మోటార్ సైకిల్‌పై ఆత్మకూరుకు బయలుదేరారు. ఇదే సమయంలో బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన నందలయ్య, మల్లన్న మరో బైక్‌పై గోకవరం గ్రామానికి బయలుదేరారు. వీరి రెండు బైక్‌లు కొత్తపల్లి సమీపంలోని ఎం లింగాపురం గ్రామం మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108 సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిమ్మరాజును కర్నూలుకు రెఫర్ చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకు వివరాలు సేకరించారు.

మహిళకు గాయాలు

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ సమీపంలో ఇంట్లో వంట చేస్తుండగా ఖైతాబేగం అనే మహిళకు గాయాలయ్యాయి. ఎస్ఐ తిరుపాలు తెలిపిన వివరాలు.. శుక్రవారం రాత్రి ఖైతాబేగం ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ పొయ్యి కింద ఉండటంతో చీరకొంగుకు మంట అంటుకుంది. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు మంటలను ఆర్పివేసి, గాయపడిన ఖైతాబేగంను 108లో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎంపీడీఓగా గాయత్రి

బండి ఆత్మకూరు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా గాయత్రి పదోన్నతి పొందారు. పాములపాడు మండలంలో ఏఓగా పని చేస్తున్న ఆమెను ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ నర్సారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ వేణి అధికారులు బదిలీ చేసినా ఇప్పటివరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని సమాచారం.

గంబూషియా చేపలతో దోమల నివారణ



పెద్దకోనేరులో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారులు

ఆత్మకూరు: గంబూషియా చేపలతో దోమల నివారణ సాధ్యమని ఆత్మకూరు సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, బైర్లూటీ పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద ఉన్న పెద్దకోనేరులో గంబూషిబియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో డెంగీ, మలేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా దోమల నివారణకు కోనేరులో గంబూషియా చేపలను వదిలినట్లు తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటు నుంచి రక్షించుకునేందుకు రాత్రిళ్లు దోమ తెరలను వాడుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. జ్వరాలు వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జుబేర్, టీబీ సూపర్‌వైజర్ మస్తానయ్య, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, రాజగోపాల్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

- **వెలుగోడు:** మండల పరిధిలోని వేల్పనూరు ఓసీ కాలనీలో ఉన్న దిగుడు బావిలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి జహీర్‌వలి గంబూషియా చేపలు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమల లార్వాలను తినేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేసుకోవడం ద్వారా దోమ కాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు.
- **నందికొట్కూరు:** పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ జలాశయంలో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంబూషియా చేపలు మురుగునీరు ఉన్న దోమ లార్వాను తినేస్తుందన్నారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ బేబి పాల్గొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విద్యార్థి తల్లిదండ్రులు

పగిడ్యాల: తమ కుమారుడిని ఎందుకు కొట్టావంటూ ఆదర్శ పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డిని ఓ విద్యార్థి తల్లిదండ్రులు నిలదీశారు. ఘటన వివరాలు.. నందికొట్కూరుకు చెందిన కార్తీక్, ప్రదీప్ పగిడ్యాల ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉంటూ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నారు. తన కుమారుడి ప్రవర్తన సరిగా లేదని, పాఠశాల నుంచి బయటకు పంపొద్దని కార్తీక్ తల్లి గతంలో కోరడంతో ఇంటర్వెల్ సమయంలో కూడా తన ఆఫీస్‌లోనే ఉండేలా వైస్ ప్రిన్సిపాల్ చూసుకునే వారు. కాగా కార్తీక్ చేత ఆఫీసు, బాత్ రూమ్ శుభ్రం చేయిస్తున్నారని తోటి విద్యార్థి ప్రదీప్ అబద్ధాలు ప్రచారం చేస్తుండటంతో విషయం తెలిసి వైస్ ప్రిన్సిపాల్ మందలించాడు. ఈక్రమంలో విద్యార్థి ప్రదీప్ ఎదురుతిరగడంతో ఆయన చేయి చేసుకున్నాడు. ఈ విషయాన్ని ప్రదీప్ తన తల్లిదండ్రులకు చేరవేయడంతో వారు పాఠశాల వద్దకు వచ్చి నిలదీశారు. తాను ఉద్దేశ పూర్వకంగా కొట్టలేదని, పిల్లల సమక్షంలో ప్రదీప్ తిరగబడడంతో అవమానంగా ఫీలై మందలించానని, జరిగిన దానికి క్షమాపణలు చెబుతున్నానని తల్లిదండ్రులకు వివరించారు. ఈ ఘటనపై ఎంఈఓ సుభాన్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారిస్తామన్నారు.

ఎన్‌సీసీతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు



ఎన్‌సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న కల్నల్ అలోక్ త్రిపాఠి

బనగానపల్లె రూరల్: ఎన్‌సీసీలో శిక్షణ తీసుకోవడం వల్ల ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కర్నూలు ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ విభాగం 145వ జూనియర్ డివిజన్‌ను ఆయన సందర్శించారు. క్రమశిక్షణ కలిగిన యువత దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని సూచించారు. బాలికలు కూడా ఎన్‌సీసీ వైపు ఆకర్షితులవ్వడం సంతోషకరమన్నారు. విద్యార్థులు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రవీణత సాధించాలని సూచించారు. ఎన్‌సీసీ ఉన్నత చదువులకు రిజర్వేషన్ పొందడంలో కూడా ఉపయుక్తమని వివరించారు. ఎన్‌సీసీ అధికారి వెంకటేశ్వర్లు, మేజర్ వైవీసీకే రెడ్డి, లెఫ్టినెంట్ కల్నల్ శశికుమార్, హవల్దార్ రవి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, సురేష్‌కుమార్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



వెలుగోడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

వెలుగోడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి సూచించారు. మండల కేంద్రంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటామని ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆర్డీఓ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసగౌడు, సర్పంచ్ వేల్పుల జయపాల్, ఈఓ నాగేంద్ర పాల్గొన్నారు.

మొక్కలు ప్రాణకోటికి జీవనాధారం

కొత్తపల్లి: మొక్కలు భూమిపై ఉన్న ప్రాణకోటికి జీవనాధారమని తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ మేరీ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం వద్ద, దుద్యాల గ్రామ సచివాలయం వద్ద స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ముందుగా గ్రామాలలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రతిజ్ఞ చేశారు. సర్పంచులు చందమాల శోభలత, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

- **బండి ఆత్మకూరు:** మండల వ్యాప్తంగా శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. పార్నపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ వేణి పాల్గొని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, పంచాయతీ సెక్రటరీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.
- **పాములపాడు:** మండలంలోని కోల్సఆనందాపురం గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రాజు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. అధికారులు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ జయంతి పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం

నందికొట్కూరు: అందరి సహకారంతో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుకుందామని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కమిషనర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి ఆలోచనలతో మన చుట్టూ ఉన్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం స్కాలర్ స్కూల్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం సరస్వతి పాల్గొన్నారు.

చెట్లు ప్రగతికి సోపానాలు



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నాగేష్

పగిడ్యాల: చెట్లు ప్రగతికి సోపానాలని మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ నాగేష్ అన్నారు. శనివారం నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ కాలుష్య నివారణకు మొక్కలు పెంపకం ఒక్కటే మార్గమన్నారు. జనాభా పెరుగుదల కారణంగా అడవులు అంతరించి పోయి ఫ్యాక్టరీలు వెలిశాయన్నారు. ఈ ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్యం వల్ల వాతావరణ సమతుల్యత దెబ్బతిని మనుష్యులపై ప్రభావం చూపుతోందన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రకుమార్, ఎంఈఓ సుభాన్, డిప్యూటీ ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఏపీఓ మద్దిలేటి, ఏఈ జావేద్, ఏపీఎం కళావతి, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సర్పంచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసిదేవి, అధికారులు

ఆత్మకూరు: ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ వ్యాధులు దూరమవుతాయని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, వరదరాజస్వామి ప్రాజెక్టు చైర్మన్ పోచ మల్లికార్జున రెడ్డి తెలిపారు. శనివారం కురుకుంద గ్రామ సచివాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు ఇంటి పరిసరాల్లో ఎక్కడైనా పారిశుధ్యం లోపిస్తే వెంటనే పంచాయతీ అధికారులకు తెలియజేయాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. పర్యావరణాన్ని వృద్ధి చేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమ్మర్, పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.